క్లుప్తంగా

పీఠంలో నేడు పౌర్ణమి పూజలు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో శనివారం పౌర్ణమి పూజలు నిర్వహించనున్నట్టు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు శుక్రవారం తెలిపారు. చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, భవాని శంకర అష్టమలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం, విజయ వేంకటేశ్వరస్వామికి తులసి దళ అర్చనలు నిర్వహిస్తామన్నారు. అనంతరం అమ్మవారికి మహిళలతో సామూహిక శ్రీచక్ర కుంకుమార్చనలు, నీరాజన మంత్రపుష్పాలు, మహా నివేదన పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఎకరానికి 47 బస్తాల దిగుమడి



పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న ఏఓ

రామచంద్రపురం రూరల్: మండలంలోని యనమదలలో రైతు పంపన సత్యనారాయణ పొలంలో శుక్రవారం పంట కోత ప్రయోగం నిర్వహించగా ఎకరానికి 47.196 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చిందని రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు కె.శ్రీదేవి, కౌలు రైతు భీమన్న పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లకు మరమ్మతులు

కపిలేశ్వరపురం: అంగర సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మలను శుక్రవారం తొలగించారు. విద్యుత్ శాఖ రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు పర్యవేక్షణలో సబ్ స్టేషన్ అధికారులు ఆధ్వర్యంలోని సిబ్బంది విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేశారు. భవిష్యత్‌లో విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు మరమ్మతులు చేస్తున్నట్టు రత్నాలరావు తెలిపారు.

సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు

కపిలేశ్వరపురం: మండలంలోని కపిలేశ్వరపురం-2, టేకి-2, వెదురుమూడి సచివాలయాల్లో శుక్రవారం ఉచిత ఆధార్ నవీకరణ శిబిరాలను నిర్వహించారు. ఎంపీడీఓ కె.రత్నకుమారి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరాల్లో చిన్నారుల ఆధార్ వివరాలను నవీకరించారు. కపిలేశ్వరపురం, వల్లూరు, టేకి సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి మల్లేశ్వరరావు, కె.దొరబాబు, ఫణి సేవలందించారు.

చలివేంద్రం ప్రారంభం

రాయవరం: మండలంలోని వెదురుపాక పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ మల్లిడి సూరారెడ్డి చేతుల మీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సూరారెడ్డి సూచించారు. ప్రతి రోజు మంచినీరు, మజ్జిగ సరఫరా చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నేతలు కొవ్వూరి చంటిరెడ్డి, కొవ్వూరి నాగిరెడ్డి, కిషోర్, బీజేపీ నాయకురాలు ఎం.శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆవరణలో ఎటువంటి విగ్రహాలు వద్దు



సర్పంచ్ అరుణకు వినతిపత్రం అందజేస్తున్న ఉప సర్పంచ్ బుచ్చిరాజు, వార్డు సభ్యులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని మేజర్ పంచాయతీ అయిన ద్రాక్షారామలో పంచాయతీ ఆవరణలో ఎటువంటి విగ్రహాలు ఏర్పాటు చేయవద్దని తీర్మానం చేయాల్సిందిగా వార్డు సభ్యులు సర్పంచ్ కొత్తపల్లి అరుణ, పంచాయతీ కార్యదర్శి పెట్టా సత్యనారాయణలను కోరారు. ఈ మేరకు శుక్రవారం పంచాయతీ భవనంలో జరిగిన సాధారణ సర్వ సభ్య సమావేశంలో వినతిపత్రం అందజేసి విజ్ఞప్తి చేశారు. ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వార్డు సభ్యులు నున్న కల్యాణ్, సాక్షి పద్మనాభం తదితరులు మాట్లాడుతూ పంచాయతీ ముందు ఆక్రమణలు అన్నీ తొలగించిన తరువాత కొత్తగా టీడీపీ జెండా స్తూపం ఏర్పాటు చేయడం వివాదాలకు కారణం అవుతుందని, ఇతర రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు తాము కూడా తమ పార్టీల జెండా స్తూపాలు ఏర్పాటు చేస్తామని ముందుకు వస్తున్నారన్నారు.

అంతే కాకుండా జాతీయ నాయకులు విగ్రహాలు ఏర్పాటు చేయాలని సర్పంచ్ నిర్ణయం తీసుకుంటే మరికొందరు కూడా తమకు నచ్చిన నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేసుకుంటామంటున్నారని అన్నారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి పంచాయతీ ఆవరణలో కానీ, మరే ఇతర పబ్లిక్ ప్రదేశాల్లో ఎటువంటి విగ్రహాలు ఏర్పాటు చేయకూడదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, వార్డు సభ్యులు కాళ్లకురచ ఏడుకొండలు, ఆశాజ్యోతి, బండి కుమారి తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రపురంలో జ్యోతిరావ్‌పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సూర్యప్రకాశ్ తదితరులు



దుగ్గుదుర్రులో పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



కె.గంగవరంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ నాగమణి తదితరులు

బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి పూలే

- కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్
- ఘనంగా పూలే జయంతి

రామచంద్రపురం: సామాజిక తత్వవేత్త, మహాత్మా జ్యోతిరావు పూలే బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా కీర్తింపబడుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన అట్టడుగు వర్గాల, పీడిత ప్రజల కోసం ఎనలేని సేవలు, త్యాగాలు చేశారని కొనియాడారు. మెరుగైన సమాజ నిర్మాణం కోసం, స్త్రీ జాతి అభ్యున్నతి, విద్య కోసం అలుపెరగని కృషి చేశారని, సామాజిక న్యాయం, మహిళా సాధికారత లక్ష్యంగా పూలే చేసిన పోరాటం ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తాయని ఆయన ఆలోచన విధానాలు యావత్ భారతదేశానికి స్ఫూర్తి దాయకంగా, భావితరాలకు, మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఇంత సంతోషం, పార్టీ నేతలు, క్యాకర్తలు, పాల్గొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన జయంతి కార్యక్రమంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేత వాసంశెట్టి సత్యం, జనసేన పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాలరావు, ఏజీపీ కమల కుమారి, నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు, పలువురు న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు జునే శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేశవ రాఘవేంద్ర, హరిబాబు, సతీష్ నాయుడు, సత్యనారాయణ, ధనరాజు, సురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూలేకు నివాళులు

కె.గంగవరం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద శుక్రవారం మహాత్మా జ్యోతిరావుపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ తదితరులు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. సంఘ సంస్కర్తగా సామాజిక వేత్తగా సమసమాజ స్థాపనకు అహర్నిశలు కృషి చేసి, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి, రచయితని జ్యోతిరావుపూలేను కొనియాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు పంపన సుబ్బారావు, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ద్రాక్షారామలో జ్యోతిరావ్ పూలే జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బీసీ, ప్రజా సంఘాల నాయకులు

కాజులూరులో..

కాజులూరు: మండల గ్రామాల్లో శుక్రవారం మహాత్మా జ్యోతిరావుపూలే జయంతిని స్థానిక నాయకులు, ప్రజలు ఘనంగా నిర్వహించారు. గొల్లపాలెంలో శివాలయం వద్ద బీసీ నేత, విశ్రాంత ఉపాధ్యాయుడు మేడిశెట్టి శ్రీరాములు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ శీలామంతుల వీరభద్రరావు పాల్గొని జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించగా దుగ్గుదుర్రు పీహెచ్‌సీ ఆవరణలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పుణ్యమంతుల శివాజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దూడల శంకరనారాయణ, అమలాపురం శెట్టిబలిజ సంక్షేమ సంఘం కన్వీనర్ కడలి రాంపండు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ తదితర నాయకులు జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల సంక్షేమానికి పూలే చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నిమ్మన రాజేష్, నందూరి కామేశ్వరరావు, కొప్పుశెట్టి రామ్మోహన్‌రావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

పూలే జయంతిని సెలవుగా ప్రకటించాలి

రామచంద్రపురం రూరల్: దేశ మొదటి తరం సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతిని ప్రభుత్వ సెలవుగా ప్రకటించాలని మైనార్టీ బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ద్రాక్షారామలో జ్యోతిరావ్ పూలే దంపతుల విగ్రహాలకు బీసీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పూలే జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రజా సంఘాల నాయకులు వెంటపల్లి భీమశంకరం, నూకల బలరాం, బి.సిద్ధూ, కొల్లపు కామేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ కుల వ్యవస్థకు వ్యతిరేకంగా సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించి ఎనలేని పోరాటం చేశారన్నారు. చదువుతోనే బడుగు, బలహీన వర్గాలు ముఖ్యంగా మహిళలు అభివృద్ధి చెందుతారని గుర్తించి స్వయంగా తన భార్య సావిత్రీభాయి పూలేను చదివించడమే కాకుండా ఆమె ద్వారా పాఠశాలలు ఏర్పాటు చేసి ఎందరినో విద్యావంతులుగా తీర్చిదిద్దారన్నారు. వారి సేవలు దేశం మరచిపోలేదని ఆ దంపతులకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేమవరపు రాంబాబు, గారోజు సూరిబాబు, మేడిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కూటమి నాయకులు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, కూటమి నాయకులు జ్యోతిరావ్ పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సాంఘిక ఉద్యమాల దివిటీ పూలే

కపిలేశ్వరపురం: దురాచారాలు రాజ్యమేలిన రోజుల్లో సాంఘిక ఉద్యమాల దివిటీగా వెలుగొందిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతీరావ్ పూలే అని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో శుక్రవారం జ్యోతీరావ్ పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కపిలేశ్వరపురంలో తహసీల్దార్ చిన్నారావు, సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఎంపీటీసీ గొల్లపల్లి సోనియా, శీలం భాస్కరరావు, ఉద్యోగుల సంఘం నాయకుడు జిత్తుక మల్లికార్జునుడు, మాజీ వైస్ ఎంపీపీ నెక్కంటి శ్రీరాంజీ, వెదురుమూడిలో శెట్టిబలిజ సంఘం నాయకులు గుత్తుల కృష్ణమూర్తి, ఇళ్ల రాంబాబు, వనుం పార్థసారథి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కపిలేశ్వరపురం కార్యక్రమంలో నవోదయ ప్రవేశ పరీక్ష 2025లో ప్రతిభ కనబర్చిన అంగర శ్రీరామకృష్ణ పబ్లిక్ స్కూల్ విద్యార్థి గౌతమ్ సాయి సాత్విక్‌ను అభినందించారు. కపిలేశ్వరపురం బీసీ సంక్షేమ సంఘం తరపున జ్ఞాపికను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ పూలే దంపతులు చేసిన త్యాగాలను వివరించారు. 1848 నుంచి 1890 వరకూ నిమ్న వర్గాల హక్కులు కోసం, మహిళా సాధికారతకోసం, బాలికా విద్య విస్తరణ కోసం నిరంతరం శ్రమించారని కొనియాడారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు మల్లిపూడి శివకుమార్, పిప్పర సంపతరావు, కట్టా మురళి, బడుగు రాంబాబు, మేడిశెట్టి పండు, పిల్లి చిన్ని, బంటుమిల్లి సాయికుమార్ పాల్గొన్నారు.



కపిలేశ్వరపురం పూలే జయంతిలో విద్యార్థి సాత్విక్‌ను అభినందిస్తున్న నాయకులు

మండపేట: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు పట్టణంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. వివిధ పార్టీల నాయకులు, బీసీ సంఘాల నేతలు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక పెద్ద కాలువ వంతెన, వాణీమహల్ జంక్షన్ వద్ద పూలే విగ్రహాలకు జాతీయ బీసీ సంఘం పట్టణ అధ్యక్షుడు మల్లువలస గణపతి ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, టీడీపీ నాయకులతో కలసి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు మహిళలతో కలిసి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే బీజేపీ నాయకుడు కోన సత్యనారాయణ ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ జ్యోతీరావు పూలే, సావిత్రీబాయి పూలే దంపతులకు భారతరత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కె.పోలమ్మ, వి.వెంకటరమణమ్మ, పిల్లి శ్రీనివాస్, పెంకే గంగాధర్, పితాపురం సత్యనారాయణ, వినకోట రాధాకృష్ణ, వుంగరాల రాంబాబు, కాసిన కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.


సమ సమాజ స్థాపకుడు పూలే



కేశనకుర్రు ప్రాథమిక పాఠశాలలో పూలే వేషధారణలో ఆకట్టుకున్న విద్యార్థి

రాయవరం: సమసమాజ స్థాపకుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని వక్తలు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని 1,583 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమ సమాజ స్థాపనకు పూలే చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా, అమలాపురం, రామచంద్రపురం డీవైఈవోలు జి.సూర్యప్రకాశ్, పి.రామలక్ష్మణమూర్తి, మండల విద్యాశాఖాధికారులు, సెక్టోరల్ అధికారులు జ్యోతిరావుపూలే జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.

కన్నులపండువగా అంకాలమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: మండలంలోని ఏడిద సీతానగరంలో అంకాలమ్మ జాతర మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఎమ్మెల్సీ తోటకు సర్పంచ్ వరదా చక్రవర్తి ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్సీ తోట గ్రామంలోని కోదండ రాముని ఆలయాన్ని దర్శించుకున్నారు. మహిళలు 501 కలశ బిందెలతో అమ్మవారికి పూజలు చేశారు. ఉదయం చండీయాగం, సాయంత్రం కుంకుమార్చనలు నిర్వహించారు. ఏడిద, సావరం గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గ్రామ ప్రముఖులు వేగిరాజు గోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు కురుపూడి రాంబాబు, అడ్డాల రామరాజు, పలివెల సుధాకర్, వల్లూరి రామకృష్ణ, ఆకుల చిన్న శీను, వెంకటేశ్వర్లు, ఆకుల రాంబాబు, భాస్కరరావు, వేగిరాజు సురేష్, మేడిద దొరబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల మార్పుపై అభ్యంతరం



రామచంద్రపురంలో పార్టీల ప్రతినిధులతో సమావేశమైన ఎన్నికల అధికారులు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం నియోజకవర్గంలోని మూడు మండలాల అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రామచంద్రపురం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల అధికారులు ఎన్నికలకు సంబంధించి అంశాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ప్రతినిధులు ఇంత సంతోషం, వెన్నేటి బాబు, మట్టా బాబులు, రెడ్డం సతీష్ మాట్లాడుతూ రామచంద్రపురం పట్టణంలోని జెడ్పీ గరల్స్ హైస్కూల్‌లో ఉండే పోలింగ్ బూత్‌ను బ్రాడీపేటకు, శీలంవారి సావరంలోని బూత్‌ను కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు, మార్చటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనితో పాటుగా రామచంద్రపురం మండలంలోని రావిచెరువుకు చెందిన సుమారు 700 మంది ఓటర్ల ఓట్లు కె.గంగవరం మండలం సత్యవాడలో ఉన్న కారణంగా రావిచెరువులోనే కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రామచంద్రపురం, కాజులూరు తహసీల్దార్‌లు బి.మృత్యుంజయరావు, ఠాగూర్‌లు మాట్లాడుతూ బూత్ లెవెల్ ఏజెంట్లు తమ పరిధిలోని 6, 7, 8 ఫారమ్‌ల వివరాలు తెలుసుకుని వాటిపై అభ్యంతరాలు ఎంటే వెంటనే బీఎల్ఓలకు తెలియజేయాలని సూచించారు. తుది ఫొటో ఓటర్ల జాబితాలు పోలింగ్ కేంద్రాల వద్ద, ఏఈఆర్ఓ కార్యాలయం వద్ద ఉన్నాయని వాటిని తనిఖీ చేసుకుని ఓట్లు చేర్పులు, తొలగింపులు, సవరణల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో 18–19 ఏళ్లు కలిగిన వారిని ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

కొత్త ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ

మండపేట: కొత్త ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ అని, 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ తేజేశ్వరరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం పలు రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా రాజకీయ పార్టీల నాయకులతో ఎన్నికల నిర్వహణ రివ్యూ సమావేశం నిర్వహించి నాయకుల సలహాలు, సూచనలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో ఈవీఎం ఓటింగ్‌కు స్వస్తి చెప్పి, బ్యాలెట్ ఓటింగ్ అమలు చేయాలని వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ ఇన్‌చార్జి యరమాటి వెంకన్నబాబు కోరారు. గత నెల మీటింగ్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ఇచ్చిన సలహాలను జిల్లా కలెక్టర్‌కు నివేదించినట్టు తహసీల్దార్ తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ మెహెర్‌బాబా, నాయకులు వుంగరాల రాంబాబు, నాళం ఫణి తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపు సమస్య పరిష్కారం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట: జనావాసాల నడుమ మద్యం షాపు ఏర్పాటు చేయవద్దంటూ దాదాపు మూడు వారాలకు పైగా మహిళలు చేపట్టిన ఆందోళన విజయవంతమైంది. సమస్యకు పరిష్కారం లభించింది. మద్యం షాపు తీయించేస్తామని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తమకు హామీ ఇచ్చారని స్థానిక మహిళలు తెలిపారు. శుక్రవారం సత్యశ్రీ రోడ్డులో మద్యం దుకాణం ఎదురుగా రిలే దీక్షలు చేస్తున్న మహిళలను ఆయన కలిశారు. తాను సమస్యను అర్థం చేసుకున్నానని, అందుకే గతంలో జేసీకి తాను మహిళలతో వినతిపత్రం ఇప్పించానని తెలిపారు. జేసీ కూడా సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో శిబిరానికి చేరుకున్న ఎమ్మెల్యే వేగుళ్ల ఎక్సైజ్ సీఐ డి.నాగేశ్వరరావు, టౌన్ సీఐ సురేష్‌తో మాట్లాడారు. దుకాణ దారుడితో మాట్లాడి మద్యం షాపు ఇక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించాలని చెప్పారు. చట్ట ప్రకారం పాటదారుడు ఏర్పాటు చేసుకున్న షాపులో వ్యాపారం నిర్వహించుకోవడానికి హక్కుందని, కానీ మహిళల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని షాపును వేరే ప్రాంతానికి మార్చడానికి ఒప్పించినట్టు తెలిపారు. దీంతో మహిళలు ఎమ్మెల్యేను పూలమాలతో సత్కరించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, వుంగరాల రాంబాబు, నల్లమిల్లి వీర్రెడ్డి, బండి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కృషితోనే పురోగతి



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్

కాజులూరు: కార్యకర్తల కృషితోనే పార్టీలు పురోగతి చెందుతాయని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, రామచంద్రపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. శుక్రవారం రామచంద్రపురం పార్టీ కార్యాలయంలో కాజులూరు మండల పార్టీ అధ్యక్షుడు, కుయ్యేరు సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి అధ్యక్షతన పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కూటమి నేతల నిర్లక్ష్య పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు వారికి అండగా నిలవాలన్నారు. అనంతరం మండల పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షుల ఎంపికపై ప్రతిపాదనలు చేసి సభ్యుల నియామకంపై కార్యకర్తలతో చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ పితాని సుబ్రహ్మణ్యం, మండల నాయకులు పోలినాటి సూర్యచంద్రం, మాత మురళి, చొల్లంగి రమణ, కొశారి గణేశ్వరరావు, యాళ్ళ బాబు, పాలిక వీరబాబు, సువ్వారి గోవిందు, దంగేటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పరిమిత ఆహారంతోనే మెరుగైన ఆరోగ్యం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ తలాటం రామ్‌ఫణీంద్ర

కాజులూరు: పరిమిత ఆహారంతోనే ప్రతి ఒక్కరూ మెరుగైన ఆరోగ్యం పొందగలుగుతారని కాకినాడ సూర్యగ్లోబల్ హాస్పిటల్ వైద్యుడు తలాటం రామ్‌ఫణీంద్ర అన్నారు. గొల్లపాలెంలోని కమ్యూనిటీ పారా మెడికల్స్, ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ (పీఎంపీ అసోసియేషన్) భవనంలో కాజులూరు, కరప మండల యూనిట్ అధ్యక్షుడు జేవీవీ సూర్యనారాయణ అధ్యక్షతన పలు వ్యాధులపై నిపుణులైన వైద్యులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఊపిరితిత్తుల వైద్యుడు తలాటం రామ్‌ఫణీంద్ర, దంత వైద్యుడు సాయిసత్య తదితరులు మాట్లాడుతూ ఆహారం మితంగా తీసుకుంటే ఆరోగ్యమని అతిగా తీసుకుంటే అది విషమన్నారు. అనంతరం ఊపిరితిత్తులు, దంత సంబంధిత వ్యాధులపై తీసుకోవలసిన జాగ్రత్తలపై పీఎంపీ వైద్యులకు, స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కెఎస్ ప్రసాద్, రాష్ట్ర నాయకుడు కేఎస్ఎన్ బాబు, మండల కార్యదర్శి ఆర్.వినయ్‌కుమార్, సంఘం రాష్ట్ర నాయకులు కేఎస్ ఆచార్యులు, మండల గ్రామాలకు చెందిన పలువురు పీఎంపీ వైద్యులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష గరిక పూజ, హోమం



లొల్లలో నిర్వహిస్తున్న లక్ష గరిక పూజ

రాయవరం: మండలంలోని లొల్లలో వేంచేసిన శ్రీవరసిద్ధి వినాయకుడి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం లక్ష గరిక పూజ నిర్వహించారు. అర్చకులు యలమంచిలి సత్యనారాయణ శర్మ, యలమంచిలి విశ్వనాథం, యలమంచిలి సుబ్బారావు పర్యవేక్షణలో వినాయక పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ఆరాధన, 11 రకాల ద్రవ్యాలతో ఏకాదశ రుద్రాభిషేకం, హోమం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం భారీగా అన్న సమారాధన నిర్వహించారు. లొల్ల, రాయవర, సోమేశ్వరం తదితర గ్రామాలకు చెందిన భక్తులు లక్ష గరిక పూజలో పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ

రాయవరం: మండలంలోని లొల్ల విశ్వమానవత ఆశ్రమంలో విద్యార్థులకు ఉచితంగా పాలిటెక్నిక్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు విశ్వమానవత ఆశ్రమం వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ సంస్థ ఏటా నిర్వహించే సేవా కార్యక్రమాల్లో భాగంగా పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు వేసవిలో సమయం వృథా కాకుండా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. శనివారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకూ మూడు విడతలుగా శిక్షణ ఉంటుందన్నారు. అలాగే యోగా, ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యాలు, హస్తకళలపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.